
చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 20.0

సెప్టెంబరు నాటికి విద్యుదుత్పత్తి!

- ఇక వేగంగా వైటీపీఎస్
- ప్రజాభిప్రాయ సేకరణ ముగియడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- పనుల పరిస్థితిపై ఆరాతీసిన ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ



నల్లగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): దామరచర్ల మండలం వీర్లపాలెంవద్ద 4,000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ (వైటీపీఎస్)లో సెప్టెంబరు నాటికి మొదటిదశ విద్యుదుత్పత్తి ప్రారంభించాలనేదిశగా ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కీలకమైన ప్రజాభిప్రాయసేకరణ కూడా పూర్తవడంతో ఇక పనుల కొనసాగింపుపై దృష్టిపెట్టాలని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు జెన్‌కో ఇంజనీర్లను, కాంట్రాక్టర్లను ఆదేశించినట్టు తెలిసింది. ఓ వైపు ఈప్రాజెక్టు నిర్మాణ పనులపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నడుమ రాజకీయపోరు నడుస్తున్నా, అధికారయంత్రాంగం మాత్రం పనుల కొనసాగింపునకు చర్యలు తీ సుకుంటోంది. పనుల కొనసాగింపునకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజాభిప్రాయసేకరణకు హాజరైన ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం.రిజ్వీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సెప్టెంబరు నాటికి రెండు యూనిట్లు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ


వైటీపీఎస్‌లో కీలకమైన పర్యావరణ అంశాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలమేరకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో బలమైన ప్రతికూల అంశాలను ఎవరూ వెలిబుచ్చలేదు. పర్యావరణ అంశాలపై ఆందోళన వ్యక్తం చేసిన మానవ హక్కుల నేత హరీందర్, సామాజికవేత్త చెన్నకేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి లేవనెత్తిన సాంకేతిక అంశాలకు పరిష్కారంగా కాలుష్యనిరోధక చర్యల్లో ఆధునిక సాంకేతికతను వాడతామని జెన్‌కో డైరెక్టర్ హామీ ఇచ్చారు. స్థానికులు లేవనెత్తిన పరిహార సమస్యలు, ఉద్యోగ భద్రతాకార్డులు, ఆర్అండ్ఆర్ కేంద్రాల ఏర్పాటును పరిష్కరిస్తామని జెన్‌కో అధికారులు చెప్పడంతో ప్లాంట్ నిర్మాణానికి ఆటంకాలు తొలగినట్లేనని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో వచ్చిన అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి కలెక్టర్ ద్వారా కేంద్ర పర్యావరణ శాఖకు నివేదించేందుకు జెన్‌కో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర పర్యావరణశాఖ త్వరలో నిర్వహించే సమావేశంలో ఈ నివేదికను సమర్పించడం ద్వారా జెన్‌కో ఈ ప్లాంటులో విద్యుదుత్పాదన చేపట్టేందుకు అనుమతులు కోరనుంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన ఒకటి, రెండు మాసాల్లో జరిగే సమావేశంలో ఈ అనుమతులు వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

పనుల కొనసాగింపుపై దృష్టిసారించాలని నిర్ణయం

ప్రభుత్వం మారడం, పలు ఆటంకాలు ఎదురుకావడం, కీలకమైన పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ ఘట్టం నేపథ్యంలో కొన్నాళ్లుగా వైటీపీఎస్‌లో పనులు మందగించాయి. ఇప్పటికే రెండు యూనిట్ల పనులు 80శాతం మేర, మిగిలిన మూడు యూనిట్లు 70శాతం మేర పూర్తవడంతో పాటు కీలకమైన రైల్వేలైన్ పనులు, హైటెన్షన్ విద్యుత్‌లైన్ టవర్ల నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. వీటితో పాటు బిల్లులు పెండింగ్‌లో ఉండటం, సామగ్రి సరఫరా నిలిచి పోవడంతో సివిల్ పనుల నిర్వహణకు బ్రేక్‌పడింది. ఇటీవల స్పందించిన జెన్‌కో ఉన్నతాధికారులు పర్యావరణ అభిప్రాయసేకరణ అనంతరం పనులు యథావిధిగా కొనసాగిస్తామని ప్రకటించారు. మంగళవారం ప్రజాభిప్రాయసేకరణకు హాజరైన సీఎండీ రిజ్వీతో పాటు, జెన్‌కో ఉన్నతాధికారులు, కలెక్టర్ హరిచందనతో కలిసి ప్లాంట్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. మొదటి దశలోని రెండు యూనిట్ల పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగించాలని, అదేవిధంగా రైల్వేలైన్, వాటర్‌లైన్ పనులు వేగవంతం చేయాలని, సెప్టెంబరు నాటికి ఈ యూనిట్లను విద్యుదుత్పత్తికి సిద్ధం చేయాలని వారు ఆదేశించారు. ఈ లోగా స్థానికులు లేవనెత్తిన అన్ని సమస్యలకు అంచెలవారీగా పరిష్కరించాలని నిర్ణయించడంతో ఇకపై ప్లాంట్ పనుల్లో వేగం పెంచేందుకు జెన్‌కో యంత్రాంగం సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

దక్షిణానికి గ్రీన్‌సిగ్నల్

- రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి ముందడుగు
- 5వేల ఎకరాల భూసేకరణ
- సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 182 కి.మీ.ల పొడవు



చౌటుప్పల్, ఫిబ్రవరి 21: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్‌రోడ్డు దక్షిణభాగం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై చర్చించారు. ఉత్తరభాగంలో ఉన్న పెండింగ్ సమస్యలతో పాటు దక్షిణ భాగానికి సంబంధించిన అనుమతులపై కూడా చర్చించారు. దీంతో గత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. దీంతో దక్షిణ భాగం రోడ్డు నిర్మాణం పట్టాలెక్కనుంది. హైదరాబాద్ చుట్టూ 60 కిలోమీటర్ల అవతల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రీజినల్ రింగ్ రోడ్డును రెండు భాగాలుగా విభజించారు. సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 160 కిలోమీటర్ల ఉత్తర భాగంగా, సంగారెడ్డి నుంచి కంది, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్, మర్రిగూడెం, సంస్థాన్‌నారాయణపురం మీదుగా చౌటుప్పల్ వరకు 182 కి.మీల దక్షిణ భాగంగా విభజించారు. ఉత్తర భాగం రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ 70శాతం పూర్తికాగా, ఇతర ప్రక్రియలు కొనసాగుతున్నాయి. తాజాగా దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించి ఇంటర్ కాంటినెంటల్ కన్సల్టెన్సీ టెక్నోక్రాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెన్సీగా బాధ్యతలు నిర్వహిస్తుంది. రీజనల్ రింగ్ రోడ్డులో భాగంగా 182 కి.మీ.ల దక్షిణ భాగానికి సమగ్రప్రాజెక్టు నివేదిక డీపీఆర్ రూపొందిస్తుంది.

అనుమానాలు.. నిరీక్షణ నడుమ

రీజనల్ రింగ్‌రోడ్డును రెండు భాగాలుగా నిర్మిస్తున్న కేంద్ర ప్రభుత్వం మొదట ఉత్తరభాగం నిర్మాణానికి అనుమతించింది. దక్షిణ భాగంలో రోడ్డు నిర్మించతలపెట్టిన ప్రాంతాల మధ్య ట్రాఫిక్ ఉండదని, ఈ ప్రాంతం మధ్య ఎక్స్‌ప్రెస్‌వే అవసరంలేదని, గతంలో జాతీయ రహదారుల సంస్థ అధికారులు అభిప్రాయపడినట్లు వార్తలొచ్చాయి. దీంతో ఈ ప్రాజెక్టు రింగ్ రోడ్డు నిర్మాణం కాకుండా ఒకవైపు మాత్రమే రోడ్డు నిర్మితమవుతుందని మరో ప్రచారం జరిగింది. సుమారు ఏడాది కాలంగా దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి అనుమతి రాకపోవడంతో దీని నిర్మాణం ఉంటుందా? అనే చర్చ సాగింది.

ఉత్తర భాగం కంటే ఎక్కువ నిధులు

రీజినల్ రింగ్‌రోడ్ దక్షిణ భాగం నిర్మాణం 182 కి.మీ.ల వరకు ఉంటుందని ప్రాథమికంగా అలైన్‌మెంట్‌లో పేర్కొన్నారు. కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ప్రస్తుతం కన్సల్టెన్సీ పూర్తిస్థాయి అలైన్‌మెంట్‌ను ఖరారు చేయనుంది. ఉత్తరభాగం నిర్మాణానికి రూ.9,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా. దక్షిణ భాగం నిర్మాణానికి పూర్తిస్థాయి డీపీఆర్ రూపొందించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో భూసేకరణ భారం పెరగవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఉత్తర భాగం కంటే దక్షిణ భాగానికి ఎక్కువ నిధులు ఖర్చవుతున్నాయి. అంచనా ప్రకారం రూ.15వేల కోట్లు అవ్వనున్నట్టు సమాచారం.

దక్షిణానికి 5వేల ఎకరాలు

రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా 182కి.మీల మేర నిర్మించనున్న దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి సుమారు 5వేల ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో డీపీఆర్ రూపొందించాక అధికారికంగా ఎంత భూమి అవసరం ఉంటుందనేది లెక్క తేలనుంది. ఉత్తరభాగంలో రోడ్డు నిర్మాణానికి 4,200 ఎకరాల భూమి సేకరణ లక్ష్యంగా పెట్టారు. ఉత్తరభాగం రోడ్డు నిర్మాణంతో పోలిస్తే దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి అదనంగా మరో 800 ఎకరాల భూమిని సేకరించాలి. ఉత్తరభాగంతో పోలిస్తే దక్షిణ భాగంలో ఎక్కువగా ప్రభుత్వ భూములు, అటవీ భూములు ఉన్నాయి.

పగలు భగ భగ రాత్రి గజ గజ

భిన్నమైన వాతావరణ పరిస్థితులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, రాత్రి వేళ చలిగాలులు బలంగా వీస్తున్నాయి. జిల్లాలో ఏర్పడ్డ ప్రతికూల వాతావరణ పరిస్థితులు ప్రజారోగ్యంతోపాటు పంటలను దెబ్బతీస్తున్నాయి. శివరాత్రికి ముందే భానుడి ప్రతాపం మొదలవుతున్న నేపథ్యంలో ఈ దఫా వేసవి తీవ్రత గతంతో పోల్చితే ఎక్కువగానే ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి.


- మిర్యాలగూడ అర్బన్, మోత్కూరు


మోత్కూరులో పూత రాలిన మామిడి తోట

- క్రమంగా పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- సాయంత్రం చలిగాలులు
- పంటలకు ప్రతికూల వాతావరణం
- ఎదుగుదల కుంటుపడిన వరి చేలు, ఆపై అగ్గి తెగులు
- ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న భిన్న వాతావరణం
- జలుబు, జ్వరాలు, ఒళ్లనొప్పులతో ఇక్కట్లు

తెల్లవారుజామున మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుండగా, ఉదయం 9గంటల తరువాత ఎండతీవ్రత పెరుగుతోంది. తిరిగి సాయంత్రం 6గంటల నుంచే చలిగాలులు ఉంటున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో తేడాలు కనిపిస్తున్నాయి. రాత్రివేళ చలితీవ్రత ఉంటుండగా, పగలు 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 36డిగ్రీలు నమోదవుతుండగా, రాత్రి ఉష్ణోగ్రతలు 19-21 డిగ్రీల మధ్యన ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రధానంగా తలనొప్పి, జలుబు, దగ్గుతో కూడిన జ్వరాలు ప్రబలి ఒళ్లనొప్పులతో ఇబ్బందిపడుతున్నారు. గడిచిన పక్షం రోజులుగా వాతావరణంలో ఇలాంటి పరిస్థితి కనిపిస్తుండగా చిన్నా, పెద్ద తేడా లేకుండా అనారోగ్యానికి లోనవుతున్నారు. భిన్న వాతావరణ పరిస్థితులు పంటలపైనా ప్రభావం చూపుతున్నాయి.

ల్యాబ్‌ల దోపిడీ



భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విషజ్వరాలు ప్రబలడంతో వైద్యచికిత్స కోసం ఎక్కువమంది రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆస్పత్రులు ఓపీ ఫీజును పెంచేశాయి. గతం లో రూ.300 ఉన్న కన్సల్టేషన్ ఫీజును రూ.500కు పెంచేశారు. మెరుగైన వైద్యం పేరుతో అనవసర పరీక్షలకు సిఫారసు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. జలుబు, తలనొప్పితో ఆస్పత్రికి వెళ్తే సీటీ స్కాన్‌కు వైద్యులు రిఫర్ చేస్తున్నారు. స్కానింగ్ ఇతర రిపోర్టుల కోసం రూ.1,500 నుంచి రూ. 2,000 వరకు వ్యయం అవుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చినా వైద్యసేవలు ఆశించిన స్థాయి లో అందడం లేదన్న కారణంతో అంతా ప్రైవేట్ బాటపడుతున్నారు.

ప్రజలు ఆస్పత్రుల బాట

ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఆరోగ్యం దెబ్బతిని ప్రజలు ఆస్పత్రుల బాటపడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు సీజన్ వ్యాధులు సోకిన రోగులతో కిటకిటలాడుతున్నాయి. వేసవికి ముందు వాతావరణంలో సమతుల్యత దెబ్బతిన్న నేపథ్యంలో ఇలాంటి పరిస్థితి నెలకొందని వైద్యులు చెబుతున్నారు. కొవిడ్ తరువాత మళ్లీ ఇలాంటి పరిస్థితి ప్రస్తుతం ఉత్పన్నమైందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు కనీస వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఎదగని వరి చేలు

రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మంచు కురవడం, ఉదయం వేళ చలిగా ఉండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. మధ్యాహ్నం ఎండ ఉంటున్నా ఉదయం మంచు, చలి కారణంగా వరి పొలాల్లో నీరు చల్లగా ఉండి వరి ఎదుగుదలను దెబ్బతీస్తోంది. అంతేగాక ప్రతికూల వాతావరణంతో వరికి అగ్గితెగులు సోకుతోంది. కాండం తొలుచు పురుగు ఆశిస్తోంది. పొలంలో నీరు విపరీతమైన చల్లగా ఉంటుండటంతో వరి వేర్లు పోషకాలు తీసుకోలేక జింక్, పొటాషియం లాంటి పోషకాల లోపంతో తెగుళ్ల బారిన పడుతున్నాయి. రాత్రి వేళ నీరు తీసి, ఉదయమే నీరు పెడితే వేడి నీరు తగిలి చేలు ఎదుగుతాయని, తెగుళ్లు కూడా ఉండవని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అయితే మడిలో నీరు పూర్తిగా తీస్తే తిరిగి పారుతుందో లేదోనన్న భయంతో రైతులు నీరు తీయడం లేదు. ప్రస్తుతం కనీసం మూ డు అడుగులైన పెరగాల్సిన వరి ఒరం (ఒడ్డు) ఎత్తు దాటడం లేదు. కొన్ని చోట్ల వేసిన నాట్లు ఎర్రబారి పిలక రావడం లేదు. మరో నెల రోజుల్లో వరి కోతకు రావాల్సి ఉండగా, పిలక వచ్చేదెప్పుడు, ఎదిగేదెప్పుడని రైతులు ఆవేదన చెందుతున్నారు. మంచు, చలి వాతావరణంతో మామిడి తోటలు కూడా దెబ్బతింటున్నాయి. మామిడిని తేనె మంచు పురుగు ఆశిస్తోంది. పూత రాలడంతో పాటు, పిందె నుంచి కూడా రసాన్ని పీలుస్తుండటంతో పిందెలు రాలుతున్నాయి. తేనె మంచు పురుగులు విసర్జించే తేనె లాంటి జిగురుపై మసి కారకమైన శిలీంధ్రాలు పెరిగి ఆకులు, కాయలపై నల్లని మసి మంగు వస్తోంది. అంతేగాక ఉదయం మంచు కారణంగా దారి కనిపించక రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు.



వారం రోజులుగా ఉష్ణోగ్రతలిలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
15న	33.5	18.4
16న	33.4	19.0
17న	34.0	19.4
18న	34.4	19.0
19న	35.0	19.4
20న	36.0	20.0
21న	35.5	20.2

కనీస జాగ్రత్తలు పాటించాలి



వాతావరణ పరిస్థితుల బట్టి ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలి. సీజనల్ జ్వరాలపై వైద్యసిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజలకు ఆరోగ్యసలహాలు, సూచనలు చేస్తున్నాం. ఏఎన్ఎం, ఆశాలు గ్రామాల్లో పర్యటించి ప్రజల ఆరోగ్యపరిస్థితులను తెలుసుకొని సంబంధిత వైద్యసిబ్బందికి సమాచారం అందజేయాలని సూచించాం. వైద్యులు సమయపాలన పాటించి రోగలకు అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలుజారీ చేశాం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ కొండల్‌రావు, నల్లగొండ జిల్లా వైద్యాధికారి

వరికి అగ్గి తెగులు



నేను మూడు ఎకరాల్లో వరి నాటు వేశా. నాటు వేసి రెండుమాసాలు గడిచింది. వరికి అగ్గి తెగులు సోకింది. ఎన్ని పురుగు మందులు పిచికారీ చేసినా తగ్గడం లేదు. ప్రతికూల వాతావరణంతోనే వరికి తెగుళ్లు సోకుతున్నాయి. పిలక కూడా రాలేదు. పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా లేదు.

- కాయితాల శంకర్‌రెడ్డి, రైతు, మోత్కూరు

పాత నీరు తీసి, కొత్త నీరు పెట్టాలి

మంచు, చలి లాంటి ప్రతికూల వాతావరణంతో వరి చేలు ఎత్తు పెరగడం లేదు. అగ్గి తెగులు కూడా ఎక్కువగా ఉంది. అగ్గి తెగులుతో వరి ఎర్రగా మారేసరికి రైతులు యూరియా ఎక్కువగా వేస్తున్నారు. యూరియా వేయకూడదు. రోజూ ఉదయమే పొలంలోని నీరు తీసి కొత్త నీరు పెట్టాలి. అగ్గితెగులు నివారణకు ఎకరాలకు 500మి.లీ., కాసుగామైసిన్ లేదా, 300 మి.లీ., ఐసోప్రొథియోలిన్ పిచికారీ చేయాలి.

- టి.గోపీనాథ్, ఏఈవో, మోత్కూరు

తేనె మంచు పురుగు నివారణకు సస్యరక్షణ చేపట్టాలి

మామిడిలో తేనె మంచు పురుగు, ఇతర తెగుళ్ల నివారణకు వెంటనే ఉద్యానశాఖ అధికారుల సలహాలు తీసుకుని సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. తేనె మంచు పురుగు నివారణకు లీటరు నీటికి 0.5మి.లీ., ఇమిడాక్లోపిడ్ లేదా, 2.5మి.లీ., కోరోఫైరిపాస్ కలిపి పిచికారీ చేయా.

- ఎస్‌కె.నసీమా, ఆత్మకూరు(ఎం) ఉద్యానశాఖ క్లస్టర్ అధికారి

24న ముసాయిదా ఓటరు జాబితా విడుదల

కలెక్టర్ హరిచందన దాసరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 21: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఈ నెల 24న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన తర్వాత జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 4న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామన్నారు. పట్టభద్రుల ఓటింగ్ కోసం జిల్లా వ్యాప్తంగా 95 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో 4,27,302 మంది ఓటర్లుగా నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, రాజకీయ పార్టీల నేతలు గుమ్మల మోహన్‌రెడ్డి, పోతేపాక లింగస్వామి, బక్క పిచ్చయ్య, బి.మల్లికార్జున్, యారా శ్రీను, చాంద్ పాషా, మహ్మద్ అబ్దుల్ మాలిక్, ఖుతుబుద్దీన్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎలక్షన్ డీటీ విజయ్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి

పార్లమెంట్ ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల విధులు, ఏర్పాట్లపై మాస్టర్ ట్రైనర్లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ ఆఫీసర్ హుస్సేన్ బాబు, తరాల పరమేష్, బాలు, గోపి, సోమయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్లు బియ్యం కొనుగోలుచేస్తే క్రిమినల్ కేసులు

- ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సాఫీగా బియ్యం సరఫరాచేయాలి
- డీఎస్‌వో వెంకటేశ్వర్లు


పౌరసరఫరాలశాఖ గోదాములను పరిశీలిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 21: లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నట్లుగా ఆధారాలతో రుజువైతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీనగర్‌లోని సివిల్‌సప్లయ్ గోదాములను బుధవారం సివిల్‌సప్లయ్ డీఎం నాగేశ్వరరావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముల్లో ప్రస్తుత నిల్వలకు సంబంధించిన స్టాక్‌రికార్డులను తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల లెవల్‌స్టాక్‌పాయింట్ (ఎంఎల్ఎస్) నుంచి ప్రతినెల 29వ తేదీలోపు రేషన్‌దుకాణాలకు బియ్యం సరఫరా చేయాలని ఆదేశించారు. బియ్యం సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలుంటాయన్నారు. ఎఫ్ఎస్‌సీ కార్డుదారులు ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌బియ్యాన్ని ఇతరులకు విక్రయిస్తే రేషన్‌కార్డు రద్దు చేస్తామన్నారు. ఇప్పటి వరకు ప్రతినెల 5వతేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ జరిగేదని, ఇక మార్చినెల నుంచి 1వ తారీఖునుంచే లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. స్టాక్ రికార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలని, రేషన్ బియ్యాన్ని పక్కదారిపట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా గోదాముల్లోని బియ్యం నిల్వల్లో ఎలాంటి తేడాలు లేవని డీఎస్‌వో తెలిపారు. ఆయన వెంట సివిల్‌సప్లయ్ ఆర్ఐ సురేందర్‌సింగ్, గోదాం ఇంచార్జి సుధాకర్ ఉన్నారు.



గ్రామోత్సవంతో ముగిసిన చెర్వుగట్టు జాతర

.6లో..

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ చందనాదీప్తి
- ట్రైనీ కానిస్టేబుళ్ల శిక్షణా కార్యక్రమం ప్రారంభం



పోలీస్ శిక్షణాకార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 21: నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్లు శిక్షణను సద్వినియోగం చేసుకొని, పోలీస్‌శాఖకు మంచి పేరు తేవాలని ఎస్పీ చందనాదీప్తి అన్నారు. పోలీస్‌శాఖలో ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాలనుంచి తొమ్మిది నెలల శిక్షణకు వచ్చిన ట్రైనీ కానిస్టేబుళ్లకు జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణా కేంద్రానికి వచ్చిన ట్రైనీ కానిస్టేబుళ్ల క్రమశిక్షణతో వ్యహరిస్తూ శిక్షణ సమయంలో ఇండోర్, అవుట్‌డోర్‌లలో శిక్షకుడు తెలిపే ప్రతీ అంశంపై పట్టు సాధించాలన్నారు.

సమాజానికి సేవ చేసేందుకు పోలీస్‌శాఖలో మంచి అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్స్‌పాల్, అదనపు ఎస్పీ రాములు నాయక్, వైస్ ప్రిన్స్‌పాల్, డీఎస్పీ విఠల్‌రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు గోపి, సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, కరుణాకర్, ఆర్ఐలు హరిబాబు, సూరప్పనాయుడు, ఎస్ఐలు, అవుట్‌డోర్, ఇండోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాతగుట్టలో కన్నుల పండువగా ఎదుర్కోళ్లు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 21 : పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టమైన స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం బుధవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ప్రధానాలయంలో నారసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు అశ్వవాహన సేవపై అధిష్ఠింపజేశారు. మహాలక్ష్మి అమ్మవారిని ముత్యాల పూల పల్లకి సేవలో తీర్చిదిద్దారు. స్వామి, అమ్మవార్ల సేవలను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన ఆచార్యులు ప్రత్యేక వేదికలపై అధిష్ఠింపజేశారు. అనంతరం ముక్కోటి దేవతల సాక్షిగా బ్రహ్మోత్సవ తిరుకల్యాణ సుముహూర్త నిర్ణయ ఘట్టం ఎదుర్కోలు మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఇరువైపులా అతిథులైన అధికారులు, అనధికారులు, రుత్వికులు ఆశీనులై పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.



ఎదుర్కోలు మహోత్సవంలో అర్చకులు, ఆలయ సిబ్బంది

సింహవాహనంపై దర్శనం

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ఉదయం స్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సింహవాహనంపై అధిష్ఠింపజేసి సేవోత్సవం నిర్వహించారు. అంతకుముందు ప్రధానాలయ యాగశాలలో మూలమంత్ర, మూర్తి మంత్ర, పంచసూక్త పఠనాలతో హోమ పూజలు జరిపారు. అలంకార సేవ ముందు అర్చకబృందం, రుత్వికులు దివ్యప్రబంధ వేద పఠనం జరిపారు.

యాదగిరికొండపై వైభవంగా వెండి జోడు సేవోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో అలంకార వెండి జోడు సేవలు వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతం, బిందెతీర్థంతో స్వామికి నిత్య పూజలు నిర్వహించారు. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యారాధనలు స్మార్త సంప్రదాయరీతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.15,04,251 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. యాదగిరీశుడిని రాష్ట్ర రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్, ఐపీఎస్ అధికారి అంజనీకుమార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

కులగణన సర్వేపై తీర్మానం చరిత్రాత్మకం

యాదాద్రి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కుల సర్వేకు ప్రభుత్వం శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టి... ఏకగ్రీవంగా ఆమోదింపచేసుకోవడం చరిత్రాత్మక ప్రక్రియ అని బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, కుల సర్వేను చేపట్టడానికి ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధంకావడం హర్షణీయమన్నారు.

గ్రామోత్సవంతో ముగిసిన చెర్వుగట్టు జాతర

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 21 : వారం రోజుల పాటు భక్తులను విశేషంగా అలరించిన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నాటి గ్రామోత్సవంతో ముగిసాయి. గజవాహనంపై ఉత్సవమూర్తులను ఆసీనులను చేసిన పండితులు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాల నడుమ గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయం నుంచి ఎల్లారెడ్డిగూడెం, చెర్వుగట్టు పురవీధుల్లో ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. శోభాయాత్ర ఆద్యంతం కన్నులపండువగా సాగింది. స్వామి అమ్మవార్లకు గ్రామస్థులు భక్తిపూర్వక స్వాగతం పలికారు. మంగళహారతులు పట్టి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకులు సతీశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, సురేశ్ శర్మ, రాంబాబు శర్మ, కాంగ్రెస్ నాయకులు నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సిరెడ్డి, గడుసు శశిధర్ రెడ్డి, వారాల రమేశ్, రేగట్టె నవీన్‌రెడ్డి, మల్గ శంకర్, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, పర్యవేక్షకుడు తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వల్లూరి శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, కిరణ్, వంశీ, రాజయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నలుగురు యువకులపై కేసు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 21: ఛత్రపతి శివాజీ జయంతి ర్యాలీలో కత్తులతో నృత్యం చేసిన నలుగురు యువకులపై కేసులు నమోదయ్యాయి. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ టూటౌన్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఇందిరమ్మకాలనీలో ఈ నెల 19న నిర్వహించిన శివాజీ జయంతి ర్యాలీలో యువకులు కత్తులు తిప్పుతూ నృత్యం చేస్తున్నట్లు స్థానికులు డయల్-100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. విచారణలో కాలనీకి చెందిన మునుకుంట్ల కృష్ణ, కేశబోయిన కార్తీక్, గుడుగుంట్ల మధు, బాణావత్ నాగేష్‌లుగా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రియుడి ఇంటి ముందు ధర్నా

శాలిగౌరారం, ఫిబ్రవరి 21: నిశ్చితార్థం అయ్యాక పెళ్లికి నిరాకరిస్తున్న ప్రియుడి ఇంటి ఎదుట యువతి ధర్నాకు దిగింది. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఆకారం గ్రామానికి చెందిన దుప్పెల్లి ఝాన్సీ అదే గ్రామానికి చెందిన ఇంద్రకంటి వెంకటేష్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరికీ వివాహం చేసేందుకు ఈ ఏడాది జనవరిలో నిశ్చితార్థం కూడా జరిగింది. ఆ తర్వాత పెళ్లి చేసుకోవడానికి వెంకటేష్ నిరాకరిస్తుండటంతో వివాదం నడుస్తోంది. అయినప్పటికీ వెంకటేష్ నుంచి పెళ్లికి సానుకూలత రాకపోవడంతో బుధవారం బంధువుల మహిళలతో కలిసి ఝాన్సీ వెంకటేష్ ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. ఆ సమయంలో ఇంట్లో వెంకటేష్ తల్లి, సోదరి మాత్రమే ఉన్నారు. వెంకటేష్ ఇంట్లో లేరు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ధర్నా నిర్వహించినా కుటుంబ సభ్యుల నుంచి స్పందన రాకపోవడంతో ఝాన్సీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేసింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అవిలయ్య తెలిపారు.

మాజీ మహిళా సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 21 : నల్లగొండ జిల్లాలో తాజా మాజీ మహిళా సర్పంచ్ ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాడ్గులపల్లికి చెందిన మాజీ సర్పంచ్ తూనం శోభ భర్త రవి గ్రామంలోని సమీప బంధువుల నుంచి, ఇతరుల నుంచి అప్పులు తీసుకున్నాడు. అవి చెల్లించాలని బుధవారం కొంతమంది ఇంటికి రావడంతో అవమానభారంతో శోభ పురుగుల మందు తాగింది. కొద్దిసేపటికి ఇంట్లోకి వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె పరిస్థితి మెరుగ్గానే ఉందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి


యాదమ్మ మృతదేహం

కనగల్, ఫిబ్రవరి 21 : నల్లగొండ జిల్లా కనగల్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. గుర్రంపోడు మండలం కోయగూరోనిబావికి చెందిన మునుగు యాదమ్మ(45) (తల్లిగారు ఎంగొరారం) దర్వేశిపురంలో శుభకార్యానికి బుధవారం మధ్యాహ్నం వెళ్లి రాత్రి 8 గంటల సమయంలో సోదరుడు ఎంగొరారం గ్రామానికి చెందిన ముచ్చపోతుల విష్ణు బైక్‌పై తిరిగి ప్రయాణమైంది. మార్గమధ్యలో కనగల్ వాగు బ్రిడ్జికి కొద్దిదూరంలో నల్లగొండ నుంచి కనగల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో యాదమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. బైకును నడుపుతున్న విష్ణుతో పాటు బైక్‌పై ఉన్న మరో మహిళ రమణమ్మకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన నుంచి కారు వెళ్లిపోవడంతో వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..


శంకరయ్య(ఫైల్)

మునుగోడు: నల్లగొండ జిల్లా మునుగోడులో జరిగిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన భీమనపల్లి శంకరయ్య(75) మునుగోడులో శుభకార్యానికి హాజరై తిరిగి మోపెడ్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. కమ్మగూడెం బస్టాప్ సమీపంలోని మురుగుకాల్వలో అదుపు తప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించేలోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు శంకరయ్య భార్య రాములమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య


యోగిత్(ఫైల్‌ఫొటో)

నార్కట్‌పల్లి: భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దాసరిగూడెం గ్రామానికి చెందిన పోలగోని యోగిత్(26)కు ఆరు నెలల కిందట చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన ప్రవళికతో పెళ్లి జరిగింది. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా గొడవ జరగడంతో భార్య ప్రవళిక అలిగి పుట్టింటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యోగిత్ బుధవారం ఇంట్లోని తన గదిలో ఉరివేసుకున్నాడు. యోగిత్ తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రైతు..


బీమా(ఫైల్‌ఫొటో)

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ నర్సింహులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం నంబాపురం గ్రామానికి చెందిన రైతు రమావత్ బీమా(48) రెండు, మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి కడుపులో మంటతో బాధపడుతుండగా ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేసినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హాలియాకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. బీమా భార్య సైది ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

ఎల్లారెడ్డిగూడెం శివారులో 110 గొర్రెల అపహరణ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 21 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో రూ.10 లక్షల విలువైన గొర్రెల మంద చోరీకి గురైంది. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెర్వుగట్టుకు చెందిన రేగట్టె భూపాల్‌రెడ్డి ఎల్లారెడ్డిగూడెం శివారులోని తన వ్యవసాయ భూమిలో ఏడాదికాలంగా గొర్రెల పెంపకం చేపట్టారు. షెడ్డులో 110 గొర్రెలు ఉన్నాయి. వీటిని చూసుకునేందుకు సూపర్‌వైజర్‌ను నియమించుకున్నారు. కాగా ఈ నెల 15వ తేదీన అర్ధరాత్రి దొంగలు గొర్రెలను ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని సూపర్‌వైజర్ యజమానికి తెలిపాడు. స్థానికంగా అందుబాటులో లేని ఆయన మంగళవారం వచ్చి షెడ్డును పరిశీలించారు. అనంతరం చోరీపై ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోకారంలో తాళం వేసిన ఇంట్లో

వలిగొండ, ఫిబ్రవరి 21 : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం గోకారం గ్రామానికి చెందిన ఎర్వ రాంచంద్రయ్య భార్య సుశీలతో కలిసి ఈ నెల 17న మేడారం జాతరకు వెళ్లారు. దైవదర్శనం ముగించుకొని బుధవారం సాయంత్రం ఇంటికి చేరుకుని చూసే సరికి ఇంట్లో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

నిద్రిస్తున్న మహిళ..

చివ్వెంల, ఫిబ్రవరి 21 : నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం తిమ్మాపురంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ బీ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాపురం గ్రామానికి చెందిన కళ్లు రాములమ్మ బుధవారం తెల్లవారుజామున ఇంటి ముందు నిద్రిస్తుండగా ఆమె నోరు మూసి నాలుగు తులాల పుస్తెలతాడును దొంగ లాక్కొని పారిపోయాడు. ఆమె అరుస్తుండగా పక్కింట్లో పడుకున్న కుమారుడు మల్లారెడ్డి, కోడలు లేచివచ్చే సరికి పారిపోయాడు. ఈ ఘటనపై కుమారుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అధికారంలోకి రావాలన్న దుగ్ధతోనే కాంగ్రెస్ హామీలు

● మాజీ మంత్రి ఈటల రాజేందర్


తుంగతుర్తిలో నిర్వహించిన విజయ సంకల్ప్ యాత్రలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

యాదగిరిగుట్ట రూరల్ / ఆలేరు రూరల్/ మోటకొండూరు / ఆత్మకూర్(ఎం) / మోత్కూరు / తిరుమలగిరి / నాగారం / తుంగతుర్తి, ఫిబ్రవరి 21 : ఎలాగైనా రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న కాంక్షతోనే కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చారని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని దివాళా తీయించారని శ్వేతపత్రం విడుదల చేసిన కాంగ్రెస్ పెద్దలు, ఎన్నికల సందర్భంగా లెక్కలేనన్ని హామీలు ఎందుకిచ్చినట్లు అని ప్రశ్నించారు. విజయ సంకల్ప్ యాత్రలో భాగంగా రెండో రోజైన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో మొదలై ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం), మోత్కూరు, తిరుమలగిరి, నాగారం, తుంగతుర్తి వరకు కొనసాగింది. ఈ యాత్రలో ప్రజలనుద్దేశించి రాజేందర్ మాట్లాడారు. మహిళా పథకాలు, రైతు, యూత్ డిక్లరేషన్ తదితర పేర్లతో ఇచ్చిన హామీలెన్ని అన్నది బహుశా ఇచ్చిన నాయకులకే గుర్తు లేకపోవచ్చన్నారు. రాష్ట్రంలో సంపదకు కొదవ లేదని ప్రగల్భాలు పలికిన కేసీఆరే ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారన్నారు. చివరకు రింగ్‌రోడ్డు, ప్రభుత్వ భూములు విక్రయించినా రాష్ట్ర అప్పుకు వడ్డీ మాత్రమే చెల్లించగలిగారని, అసలు కూడా కట్టలేకపోయారన్నారు.

యాత్రలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు దాసరి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ పాల్గొన్నారు. కేసీఆర్ ఆసరా పింఛన్లు రూ.2 వేలు, దివ్యాంగులకు 3 వేలు ఇవ్వడానికే నానా తంటాలు పడగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తారని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరంపై కాకిగోల చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు మాసాలు అవుతున్నా పిల్లర్లు కుంగాయంటున్నారే గానీ అందుకు బాధ్యులైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వచ్చే యేడాది వర్షాలు తక్కువగా కురిస్తే తుంగతుర్తి నియోజక వర్గానికి నీరే రాదన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం

దేశంలో బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యమని ఈటల రాజేందర్ అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశంలో డిజిటల్ పేమెంట్స్ తీసుకొచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు.

● చేనేత కార్మికుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ మోత్కూరులో చేనేత కార్మికులు ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

● నాగారం మండల కేంద్రంలో సభ నిర్వహణ లేకపోవడంతో అభిమానులకు బీజేపీ నాయకులు అభివాదం చేసుకుంటూ వెళ్లారు.

● యాదగిరిగుట్ట, మోటకొండడూరు కార్యక్రమాల్లో నాయకులు లింగస్వామి, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్, మోటకొండూరు మండల అధ్యక్షుడు జోరుక ఏల్లేష్, జిల్లా కార్యదర్శి పీసరి తిరుమల్‌రెడ్డి, చిర్ర రవీందర్, అనంతుల పాండురంగారెడ్డి, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, రేగు మల్లేష్ పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎం)లో పార్టీ మండల నాయకులు తడిసిన మల్లారెడ్డి, బొట్టు అబ్బయ్య హాజరయ్యారు.

● మోత్కూరులో బీజేపీ మండల నాయకులు ఏనుగు జితేందర్‌రెడ్డి, గుజ్జ సోమనర్సయ్య, గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, బొట్టు అబ్బయ్య, బొట్టు కృష్ణయ్య, లింగాల శ్యాంసుందర్‌రెడ్డి, దీటి సందీప్, తిరుమలగిరిలో కాప రవి, దీన్‌దయాల్, బంగారు, హన్మంతు, కొండసోమయ్య, తుంగతుర్తిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, బొబ్బ భాగ్యారెడ్డి, సంకినేని రవీందర్‌రావు, మల్లెపాక సాయిబాబా, గాజుల మహేందర్, రమేష్, లింగయ్య, నాగరాజు, పాల్గొన్నారు.



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవింద రాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటుచూసినా భక్త జన సంద్రం. అన్నిదారులు మేడారం వైపే.. పలుమార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు పరిసరాలన్నీ జనజాతరయ్యాయి.తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగామారింది. ఇప్పటికే కోటిమంది భక్తులు వచ్చినట్టు అంచనా.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం

రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలి


శిథిలావస్థకు చేరిన సిబ్బంది క్వార్టర్లు

దామరచర్ల మండల కేంద్రం పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్నా స్థానికంగా రైల్వేస్టేషన్ లేకపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 1988లో రైల్వేలైన్ నిర్మాణం పూర్తయిన తర్వాత కొంతకాలం పాటు దామరచర్లలో నిర్మించిన రైల్వేస్టేషన్‌లో రైళ్లు నిలిచేవి. దీంతో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఈ స్టేషన్ గుండా వివిధ ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించేవారు. తర్వాత విష్ణుపురం రైల్వేస్టేషన్‌ను వినియోగంలోకి తీసుకొచ్చిన అధికారులు దామరచర్ల స్టేషన్‌ను 1994లో మూసివేశారు. దీంతో రైలు ప్రయాణం చేయాలనుకునే ప్రయాణికులు దామరచర్ల నుంచి సుమారు 3కి.మీ దూరం వెళ్లి విష్ణుపురం స్టేషన్‌కు చేరుకోవాల్సిందే. లేదంటే పల్నాడు జిల్లా నడికుడి, మిర్యాలగూడ రైల్వేస్టేషన్లకు వెళ్లాల్సి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిథిలావస్థకు చేరిన రైల్వేస్టేషన్‌ను కొన్నేళ్ల క్రితం కూల్చివేశారు. ఉద్యోగుల కోసం నిర్మించిన పలు క్వార్టర్లు వినియోగించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు రైల్వే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

● దామరచర్ల

'డబుల్' పట్టాలు ఇవ్వండి సారూ..


తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల ఆందోళన

డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు గతేడాది నవంబరులో లాటరీ పద్ధతిలో 60 మందిని ఎంపిక చేశారు. కానీ ఇప్పటివరకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లికి చెందిన 60మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు. ఇళ్లు నిర్మించారు. కానీ ఇళ్ల పట్టాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని లబ్ధిదారులు ముత్యాల మంగమ్మ, మట్టిపల్లి బుచ్చమ్మ, లక్ష్మయ్య, లక్ష్మమ్మ, చాట్ల అనిత, ఎర్ర అంజనేయులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇళ్ల పట్టాలు అందజేసి సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

● దేవరకొండ

విస్తుపోయేలా విస్తరణ పనులు


పైప్‌లైనుపై ఏర్పాటు చేస్తున్న స్తంభం

కోదాడ-జడ్చర్ల రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలో చేపట్టిన నిర్మాణ పనులు పురపాలకులకు తలనొప్పిగా మారాయి. నేషనల్ హైవే ఆథారిటీ అనుమతి పొందిన గుత్తేదారులు రోడ్డు ఏర్పాటుకు ముందు డ్రైన్ల నిర్మాణం కోసం సాగర్‌రోడ్డు పొడవునా ఐదారడుగుల మేర గుంతను తవ్వి కాంక్రీట్‌తో కాల్వ లాంటి నిర్మాణం చేపడుతున్నారు. అలా తవ్వకాలు చేస్తున్న క్రమంలో పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే పైపులు ధ్వంసమవుతున్నాయని, పలు కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు వాపోతున్నారు. గుంతల తవ్వకాల్లో ఛిద్రమైన పైపులైన్లకు మరమ్మతు నిర్వహించే సమయం ఇవ్వకుండానే కాంక్రీట్ వేస్తుండగా పట్టణ ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని ఉద్యోగులు తలపట్టుకుంటున్నారు. పట్టణంలో వంద అడుగుల మేర విస్తరించాల్సి ఉన్నా స్థలసేకరణ కష్టతరంగా మారడంతో 90 అడుగులకు కుదించారు. రెండు నెలల క్రితం పనులు చేపట్టారు. రహదారి విస్తరణ ఏ మేరకు చేపడుతున్నారో తెలపాలని కోరుతున్నారు. పనుల విషయంలో ఫిర్యాదులు వస్తుండటంతో ఈ విషయాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ కలిసినట్లు మునిసిపల్ చైర్మన్ భార్గవ్ తెలిపారు.

● మిర్యాలగూడ టౌన్

వంతెన కోసం ఎదురుచూపులు


అంగడిపేట వద్ద వాగు దాటుతున్న ప్రయాణికులు (ఫైల్ ఫొటో)

చండూరు- మునుగోడు మార్గమధ్యలో చండూరు శివారులో వాగు వరద కష్టాలు తీరడం లేదు. చండూరు నుంచి తాస్కానిగూడెం వరకు ఉన్న 3 కిలోమీటర్లు బీటీ రోడ్డు పంచాయతీరాజ్ శాఖలో ఉంది. దీంతో రోడ్డు విస్తరణ, హైలెవల్ వంతెన నిర్మాణానికి ఇప్పటి వరకు అడ్డంకిగా ఉండేది. ప్రస్తుతం చండూరు మునిసిపాలిటీ పరిధిలోకి రావడంతో సమస్య పరిష్కారమైంది. 2018 తర్వాత ఎక్కువగా వరదలు వచ్చాయి. పలు మార్లు రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఉప ఎన్నికల సమయంలో హామీల్లో భాగంగా వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వంతెన నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.5.60కోట్లు మంజూరు చేయగా అక్టోబరు 4వ తేదీన నాటి మంత్రి జగదీ‌ష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వెంటనే వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● చండూరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


నీరునిల్వ ఉన్న నీటితొట్టిని పరిశీలిస్తున్న వైద్యబృందం

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 21: ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీంతో రోగాల బారిన పడకుండా ఉంటారని డీఎంవో నల్లగొండ దుర్గయ్య అన్నారు. మండలంలోని ఇందుగుల గ్రామంలో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించి ప్రజలకు పలు పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి సిబ్బందితో శుభ్రం చేయించారు. పరిసరాలు శుభ్రంగా లేకపోతే దోమలు వృద్ధి చెంది చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా సిబ్బంది ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, ఇక్తియార్, ఫిర్దోజఫర్థండ, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఏలు రామ్మోహన్‌చారి, రాజు, భవాని, సునీత, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం


మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 21: బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందని ఎంసీపీఐ(యు) కేంద్రకమిటీ సభ్యుడు వస్కుల మట్టయ్య ఆరోపించారు. బుధవారం పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ రాజ్యాంగ, లౌకిక భావనను దెబ్బతీస్తూ మత రాజ్యస్థాపనకు పూనుకుంటుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందని ఆరోపించారు. కార్మికులకు కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, నాయకులు పోతుగంటి కాశీ, మోహన్‌నాయక్, కిరణ్, భరత్, ఆశీర్వాదం, వీరన్న, జ్యోతి, లింగమ్మ, సాలమ్మ, పవన్, ప్రశాంత్, సతీస్, హరీష్ పాల్గొన్నారు.

యువత ఎదుగుదలకు క్రీడలు ఎంతో దోహదం

నల్లగొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 21: యువత ఎదుగుదలకు క్రీడలు ఎంతో దోహదపడతాయని వరల్డ్ హిందూ లయన్స్ ఫౌండర్, బీజేపీ జాతీయ నాయకుడు పెరిక సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఖేలో తెలంగాణ వరల్డ్ హిందూ లయన్స్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్లమెంట్ స్థాయి క్రికెట్, సెపక్‌తక్రా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నల్లగొండలో పార్లమెంట్ స్థాయి క్రీడా పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జరిగిన క్రికెట్ పోటీల్లో 16జట్లు పాల్గొన్నాయి. పోటీలను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. దీంతో మైదానం క్రీడాకారులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో అంపైర్లు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపుల నిర్మూలన కమిటీల ఏర్పాటు

చండూరురూరల్, ఫిబ్రవరి 21: మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశానుసారం మండలంలో బెల్టుషాపుల నిర్మూలన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ సర్పంచులు కొరిమి అలివేలు ఓంకారం, మేకల వెంకన్న తెలిపారు. మండలంలోని ఉడుతలపల్లి, కోటయ్యగూడెం గ్రామాల్లో బుధవారం కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో 10 మంది మహిళలు, 10 మంది పురుషులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కమిటీలు బెల్టుషాపులు లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కావలి అంజనేయులు, కో ఆప్షన్ సభ్యుడు శుజావుద్దీన్, బంగారిగడ్డ ఎంపీటీసీ పల్లె వెంకన్న, మాజీ సర్పంచులు అబ్బనబోయిన లింగయ్య, సాపిడి రాములు, ఆంజనేయులు, యాదయ్య, నాయకులు రాజు, కడారి లక్షణ్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత : కేసు నమోదు

మర్రిగూడ, ఫిబ్రవరి 21: బెల్టు షాపుపై దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని శివన్నగూడెం గ్రామానికి చెందిన ఐతరాజు శ్రీను బెల్టుషాపును నిర్వహిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం దాడి చేసి 32 క్వాటర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

మాతృభాష అభివృద్ధికి కృషి చేయాలి


నల్లగొండలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న అద్దంకి లక్ష్మయ్య

నల్లగొండ కల్చరల్, నల్లగొండటౌన్, హాలియా, తిరుమలగిరి(సాగర్), కట్టంగూరు, శాలిగౌరారం, ఫిబ్రవరి 21: మాతృభాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కవి, గాయకుడు అద్దంకి లక్ష్మయ్య అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్జీ కళాశాలలో బుధవారం జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాతృభాషలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, పరాయి భాషను నేర్చుకున్నా మాతృభాషపై గౌరవం ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ తెలుగుభాష ఎంతో మధురమైనదని, ఇతరుల మాతృభాషలు కూడా వారికి అంతే గౌరవం ఉంటుందని, మాతృభాషలో ప్రావీణ్యం పొందితే ఇతర భాషల్లో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సయ్యద్ మునీర్, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, అధ్యాపకులు లవేందర్‌రెడ్డి, గోవర్ధనగిరి, సైదులు, ప్రభాకర్, రమ్య, అంజయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

● మాతృభాషలో విద్యాభ్యాసం బలమైన జ్ఞాన పునాదులను వేస్తుందని, అందువల్ల మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ సాహితీవేత్త ఎంవీ. రఘువీర్ ప్రతాప్ అన్నారు. సిలివేరు సాహితీ సేవా కళాపీఠం ఆధ్వర్యంలో ఎంవీఎస్ విజ్ఞానకేంద్రంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంజనీరింగ్, వైద్యవిద్య వంటి సాంకేతిక చదువులు కూడా మాతృభాషలో రాయాల్సిన అవసరం ఉందన్నారు. కళాపీఠం అధ్యక్షుడు సిలివేరు లింగమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు, రచయితలు సత్తయ్య, హసేన, దేవదానం, అచ్చయ్య, బుచ్చిరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

● అనుముల మండలం చింతగూడెం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం అబ్బిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ భావ ప్రసరణకు, జ్ఞానార్జనకు మాతృభాషను మించిన సాధనం లేదని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం శ్యాంప్రసాద్, ఎండీ పాషా, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, లింగయ్య పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కొనమంచలి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుభాష ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పాలని అన్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం పరమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావని, బాలకృష్ణ, విజయలక్ష్మి, లింగమ్మ, గౌస్‌బాబా, నరేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరులోని జడ్పీ హైస్కూల్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ఆవరణను ముగ్గులు, తోరణాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, హెచ్ఎం అంబటి అంజయ్య, టీచర్లు మహ్మద్ అబ్దుల్‌గఫూర్, రాజేందర్, శ్రీనివాస్, చంద్రయ్య, నర్సింహారెడ్డి, యాదగిరి, సునంద, సుజాత, పద్మావతి, నీరజ పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తెలుగు వికాస వేదిక ఆధ్వర్యంలో పద్యపఠన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈవో మేక నాగయ్య మెమొంటోలు, బహుమతులు అందజేశారు. బి.వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తెలుగు పండిట్ ఉపాధ్యాయులు మారోజు వెంకటాచారి, పి.శంకర్, డి.శంకర్, వి.సైదులు, దాచవరం జగదీ‌ష్‌బాబు, కొయ్యడ శివశంకర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


తిరుమలగిరిసాగర్ : కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు


శాలిగౌరారం: విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న ఎంఈవో నాగయ్య

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : బాలునాయక్


వద్దిపట్లలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 21: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని చిలుకమర్రి, బాలాజీనగర్, పీఏపల్లి, అంగడిపేట, దుగ్యాల, మేడారం, పడమటితండా, వద్దిపట్ల, భీమనపల్లి, కేశంనేనిపల్లి, గుడిపల్లి గ్రామాల్లో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు అన్ని రకాలుగా అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో బీటీ, సీసీరోడ్ల నిర్మాణాలతో పాటు మంచినీటి సౌకర్యానికి అత్యధిక నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రోడ్లపై వర్షం నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ.. సీసీరోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జడ్పీఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య, వైస్ఎంపీపీ సరితనర్సింహ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, ఎంపీటీసీలు మధుసూదన్‌రెడ్డి, నక్క రామయ్య, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చట్టాలపై అవగాహన ఉండాలి

చందంపేట, ఫిబ్రవరి 21: ప్రజలు, యువకులు సామాజిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి దీప్తి అన్నారు. చందంపేట మండలం కొత్తకంబాలపల్లి గ్రామంలో బుధవారం చేపట్టిన సామాజిక చట్టాల అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చట్టాలను లోతుగా విశ్లేషించాలని, తద్వారా చట్టాలపై అవగాహన పెరుగుతుందన్నారు. మహిళలు, యువతులపై జరిగే అఘాయిత్యాలను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఆర్డీవో శ్రీరాములు, డీఆర్‌డీవో పీడీ నాగిరెడ్డి, చందంపేట ఎస్ఐ సతీష్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

గుర్రంపోడు, ఫిబ్రవరి 21: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు గుర్రంపోడు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తేనేపల్లి గ్రామానికి చెందిన బొడ్డు సుభద్ర(32) ఈ నెల 1న భర్త బొడ్డు కిరణ్‌తో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆ రోజు నుంచి కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త కిరణ్ బుధవారం తన భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

రైతులు ఈకేవైసీ చేయించాలి

కేతేపల్లి, ఫిబ్రవరి 21: రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) రామారావు అన్నారు. మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించాలని, లేకపోతే తదుపరి పీఎం కిసాన్ లబ్ధి పొందలేరని తెలిపారు. రైతులు ఇప్పటి వరకు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలని, ఈకేవైసీ చేయించుకోని రైతులు ఏఈవోలను సంప్రదించాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 21: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు 2022 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలని, విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. పీఆర్సీ రెండో నివేదిక అమలు చేయాలని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో 50శాతం రాయితీ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు టి.నర్సింహ, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు చంద్రమౌళి, శ్రీశైలం, రంగయ్య పాల్గొన్నారు.

ముగ్గురి బైండోవర్

కట్టంగూరు, ఫిబ్రవరి 21: అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి కట్టంగూరు ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన నౌషద్ గ్రామాల్లో తిరుగుతూ వస్త్రాలు విక్రయిస్తున్నాడు. అందులో భాగంగా కట్టంగూరులోని ఎస్ఎస్‌వీఎన్ స్కూల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదే సమయంలో పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులు పట్టుకుని విచారించారు. నౌషద్ పోలీసులకు పొంతన లేని సమాధానం చెప్పడంతో నౌషద్‌తో పాటు చుట్టుపక్కల తిరుగుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోమన్, ఖాజామ్‌లను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

పేద విద్యార్థులు చదువులో రాణించాలి

దేవరకొండ, ఫిబ్రవరి 21: పేద విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సీపీఐ జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని పడ్మట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పీఆర్ఆర్ ఫౌండేషన్ అందజేసిన మ్యాథ్స్, సైన్స్ స్టడీ మెటీరియల్‌ను బుధవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చల్లాం పాండురంగారావు, నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, అంజనేయులు, హెచ్ఎం ఝాన్సీరాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

వేములపల్లి: మండల కేంద్రంలోని పీఏసీఎస్ చైర్మన్‌పై గురువారం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. చైర్మన్ తీరుపై అసంతృప్తిగా ఉన్న 9 మంది డైరెక్టర్లు అతన్ని తొలగించాలని కోరుతూ జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో గత నెల 29వ తేదీన అవిశ్వాస తీర్మానంపై నోటీసులు జారీ చేశారు. నేడు ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అవిశ్వాస తీర్మానంపై చర్చను నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగే గ్రామాలకు గురువారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ దేవోజీనాయక్ తెలిపారు.

అడవిదేవులపల్లి: మండలకేంద్రంలోని మహిషాసురమర్థిని అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మండల స్థాయి కబడ్డీ పోటీలను బుధవారం మాజీ ఎంపీటీసీ బాలునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల క్రీడాకారులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని, స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని అన్నారు.

దామరచర్ల: నూతన ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును యువజన కాంగ్రెస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం భైరవునిబండ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దండ అశోక్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే మందుల సామేల్‌కు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విన్నవించారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. అంతకుముందు పంచముఖ ఆంజనేయస్వామి, పరశురామ విగ్రహాలను ఊరేగించి ఆలయంలో ప్రతిష్ఠించారు.

హాలియా: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఈనెల 25వ తేదీన జరగనున్న శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ బాబురావునాయక్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఉన్న బంజారా సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, మహిళా నాయకులు, విద్యార్థి నాయకులు హాజరు కావాలని కోరారు.

హాలియా: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యాబుద్ధులు నేర్చుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో గంధం పద్మావతి అన్నారు. హాలియాలోని గురుకుల పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యూట్రిషన్ వివరాలు, సెల్ఫ్ డిఫెన్స్, ఉమెన్ ట్రాఫికింగ్ గురించి వివరించారు.

మర్రిగూడ: అంగన్‌వాడీ చిన్నారులు ఉపాధ్యాయులుగా మారారు. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, విద్యాబోధనలపై అవగాహన కల్పిస్తూ స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు మర్రిగూడ ఆస్పత్రి సిబ్బంది చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్ఎం అనురాధ బహుమతులు అందజేశారు.

కనగల్: మండలంలోని రేగట్టే ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో తరి రాములు బహుమతులను పంపిణీ చేశారు.

'తొలిమెట్టు', 'ఉన్నతి' రద్దుచేయాలి

నల్లగొండ, ఫిబ్రవరి 21: విద్యార్థులు, ఉపాధ్యాయులను అయోమయానికి గురిచేస్తున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. 317 జీవో ద్వారా కుటుంబాలకు దూరమైన బాధిత ఉపాధ్యాయులకు సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం నకిరేకల్ కాంప్లెక్స్ హెచ్ఎం కోదాటి రాములు సంఘంలో చేరి సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి, నాయకులు చామల చంద్రశేఖర్, బండ రమే‌ష్‌రెడ్డి, యుగేందరాచారి, భిక్షం, జాన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, రమే‌ష్‌బాబు, రాములు, యాదగిరి పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 21: గ్రామపంచాయతీల్లో గల నర్సరీల్లో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో శేషగిరిశర్మ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలను నాటి ఎండిపోకుండా సంరక్షించాలన్నారు. ఒకవేళ ఎండిపోతే వాటి స్థానంలో కొత్త వాటిని నాటాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్‌ను ఉపయోగించాలన్నారు. జనన, మరణాలను రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేయాలన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో వీరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.